# సన్నాటా

## శ్రీమతి ఐ. వి. యస్. అచ్యుతవల్లి

ఎప్పటి పసుపురంగుగల మేడ అది! ఆ రంగువేసి పది పదిహేనేళ్లు అయివుంటుంది. పది హేనేళ్ల ఎండ లకీ, వానలకీ ఆ రంగు తట్టుకుని నిలబడింది. అయినా, యవ్వ నంతో మెరిసిపోయే గులాబీల బుగ్గలున్న, పదహారేళ్ల జవ్వని లా గేంలేదు. రకరకాల సౌందర్య పోషకాలతోటే బలవంతంగా, అందాన్ని, లావణ్యాన్ని నిలబెట్టుకుంటున్న నలభయిఏళ్ల పైబడ్డ, నాయికవేషాలేసే సినీతారలా వుంది, ఆ మేడ! ఒంకు వొంకులు తిరిగిన, లాజాలతో, రెండు మూడు అంతస్థు లుంటుంది. పైన మూడు అడుగుల పిట్టగోడతో బాల్కనీ వుంది. పూర్వకాలపు జమీందారీ కుటుంబాలకి చెందిన దా మేడ! కాలం కదలిపోవుటతో జమీందార్ల జమీలు కూడా, కరగిపోయాయి. వ్యర్థమైన దాంబికాలు వదలి, ఆ మేడ క్రింది భాగాలని, చిన్న చిన్న వాటాలుగా విభజించి, అద్దెల కిచ్చుకున్నాడు, ఆ జమీందార్ల వారసుడయిన మజుందారు. అతని సంసారం మొదటి అంతస్థులో ఉంటోంది. కింది భాగాల్లో, ఒక పచారీకొట్టు, చిన్న చెప్పుల దుకాణం, ఒక దర్జీకొట్టు, ఒక పాన్‌బీడా షాపు ఉన్నాయి. 'దర్జీ' కుట్టు మిషన్ ఎప్పుడూ, రాత్రింబగళ్లూ, 'బర్‌ర్‌ర్' మంటూ తిరుగు తూనే ఉంటుంది. పాన్‌బీడాషాపు యజమాని జకరయ్యకీ మధ్య ఏదో లాటరీలో చిన్న ట్రాన్సిస్టర్ వొచ్చింది. ఉదయం ఏడు గంటలనించీ, రాత్రి పదకొండుగంటలదాకా హిందీ, తెలుగు, తమిళం, ఇంగ్లీషు మొదలయిన భాషాభేదం లేకుండా అన్ని రకాల ప్రోగ్రాంలూ పెట్టుతూ ఉంటాడు. నెలకోసారి అప్పు చేసయినా, బ్యాటరీకొనివేస్తూ వుంటాడు. ఆ ట్రాన్సిస్టర్ చెవికోసిన మేకలా అరుస్తూ 'గుర్ర్ర్' అంటూ మధ్యమధ్య గండుపిల్లిలా గుర్రుపెట్టూ వుంటుంది. ఇరుగు పొరుగు భవంతుల్లో పనిచేసే చిన్న కుర్రవాళ్లు 'కిళ్లీల' కని వచ్చి, ఆ రేడియోకేసి, ఆసక్తిగా చూస్తూంటారు. జక రయ్యకి వాళ్లు అల్లా చూస్తూవుంటే ఏదో చెప్పలేనంత గర్వం నిండుకొస్తుంది. గడ్డం పొడుగుచేసి, పెదిమలు బిగ బెట్టి, నుదురు చిట్లించి ఆ ముల్కని అటూ ఇటూ కదుపు తూంటాడు. చెప్పులదుకాణం, మేనేజరు, నమ్మయ్య, వరండా మీదకి ఒక రంగులువెలిసిపోయిన కేన్‌కుర్చీ వేసుకుని ప్రార్థన చేస్తూన్న వాడిలా కళ్లు మూసుకుని కూర్చుని ఉంటాడు. రెండవ అంతస్థులో సగంభాగం గచ్చులూ అదీ పోయి, రంగులు వెలిసిపోయి శిథిలాలయంలా వుంటుంది.

అందులోనే తాలూకా కచ్చేరీలో పనిచేసే వెంకయ్య కుటుంబ ఉంటూంది. వెంకయ్య భార్య సీతాలక్ష్మి శంకరి. నోరూ వాయిూలేని, గోమాతలాంటిది! వెంకయ్య తెచ్చిపోసే గింజలేవో ఉడకేసి పెట్టటంతప్పితే ఇంకో గొడవేదీ పట్టించుకోదామె! వెంకయ్యకి, పెళ్లాం ఎనమండు గురు పిల్లలూకాక, చిన్నప్పుడే భర్తపోయిన అక్క సూరమ్మ కూడా వుంది. సూరమ ఇంట్లోవున్నవీ లేనివీ చూసుకుంటూ ఏ పూట ఏం వండాలో, మరదలుకి పురమాయించుతూ ఉండేది. సూరమ్మ కీమధ్య నాలుగయిదునెల్లాయి వంట్లో బాగా వుంటంలేదు. ఏం జబ్బో ఏమిటో తెలీదు. ఆయాసం, నీరసం, నిస్త్రాణ, అంటూ రోజులో ఎక్కువభాగం మంచా నికే అతుక్కుపోయివుండేది. తన జబ్బు గురించి వెంకయ్య ఏమీ పట్టించుకోవటంలేదనీ, ఆమె అభిప్రాయం. తను ఇంత హైరానుపడి, కండిలాంటివాడ్ని కొండంతచేసి, పెళ్లి పేరంటం చేసినందుకు తనకి సరయిన వైద్య సదుపాయాలు చేయటం వెంకయ్య కనీసపు కర్తవ్యం అని ఇరవయ్నాలు గంటలూ సాధించిపోసేది. వెంకయ్యఅయినా, సూరమ్మ జబ్బుని గాలికి వదిలెయ్యలేదు. గాలనీ ధూళినీ, మంత్రాలనీ, జపాలనీ చేయించాడు. రూపాయీ, అర్ధాపెట్టి తావీజాలు కట్టించాడు. శంకరిచేత కొబ్బరికాయలూ, పసుపునీళ్లూ, కుంకంనీళ్లూ, పేడముద్దలూ దిగదుడుపులు పెట్టించాడు. హోమియోపతీ మాత్రలు గంటకీ రెండుగంటలకీ పుంజీడేసి మింగించాడు. సూరమ్మకి, ఈ తస్సీ, బుస్సీ వైద్యాలంటే ఏమాత్రం నమ్మకంలేదు. అంచేతనే ఆమెకి ఏమాత్రమూ రోగం తగ్గినట్లనిపించలేదు. వెంకయ్య ఒంటిగంటకి భోజ నానికి వొచ్చేవాడు. ఆ సమయానికి సూరమ్మ పట్టెమంచం మీద నడుంగా బాసింపట్లు వేసుకుని కూర్చునేది. ( మంచం కుక్కిఅయిపోయిన నవారుమంచం. అదే సూరమ్మ గారి హంసతూలికాతల్పం! దానిమీద చిరుగుపట్టి, మురికివాసనేస్తూ వున్న రెండు, మూడు బొంతలుంటాయి. అవి ఆమెకి ముఖ మల్ పరుపులు! 'కొబ్బరిపీచు' కుక్కి తయారుచేసుకున్న దిండు కూడా వుంది సూరమ్మకి! 'సూరమ్మది భారీవిగ్రహం!' హుం!' అంటూ పెద్దగా దీర్ఘంగా మూలిగేది. అది ఆమె చెప్పబోయే ఉపన్యాసానికి నాందీ ప్రస్తావన అన్నమాట!

'ఈ ఇంట్లో నేనున్నా ఒకటే, పోయినా ఒకటే! అసలు ఇదెక్కడి పీడరా బాబూ! ఇదెప్పుడు విరగడయిపోతుం

దిరా నాయినా అంటూ కనిపెట్టుకు కూర్చున్నారు. ఒక్క పూట గుప్పెడు మెతుకులు తింటూ, కాలక్షేపం చేస్తూ పెంచుకొచ్చాను. ఆ కృతజ్ఞతేమన్నా వుండి ఛస్తేగా! అయిదారు నెల్లాయి రోగంతో తీసుకు ఛస్తున్నాను. పెద్ద డాక్టరుని పిలిపించి చూపిద్దామన్న ఆలోచనే రాలేదు. రోజూ లబో, దిబోమని మొత్తుకుంటూంటే కూడా దిక్కులేదు. ఇన్ని కషాయంబుంసిళ కీ, పంచదారమాత్రలకి, పెద్దకాలంలో వొచ్చే రోగాలు తగ్గుతాయా! ఏ ఆపరేషనో, ఇంజెక్షనో ఇప్పించాలి. (ఆపరేషన్, ఇంజక్షన్ పెద్ద పెద్ద మందులనీ, అద్భుతంగా పని చేస్తాయనీ ఆమె అభిప్రాయం.) డబ్బుకి ముఖం మాడ్చుకుంటే ఎలాగ? కావాల్సివస్తే నా పొలం బేరంపెట్టి అయినా పెద్ద ఇంగిలీషు డాకటరుని పిలిపించాలి! వెధవడబ్బు శాశ్వతమా! ప్రాణం పోస్తుందా!' అంటూ గొణుక్కుంటూ కూర్చునేది. సూరమ్మకున్న పొలం అంతా అరయకరం కన్నా ఎక్కువలేదు. సూరమ్మభర్త చిన్నప్పుడే పోయేడు. సూరమ్మ తల్లి పేచీలుపెట్టి అడగ్గా, అడగ్గా పళ్లేళ్ళూ, జీళ్లేళ్ళూ మొలిచిపోయిన దిబ్బమీద ఒక అర యకరం వాసి పడేసాడు, సూరమ్మ మావగారు. అదేదో పెద్ద పల్లపుపొలం అయినట్లూ, దానిమీద బోలెడు ఫలసాయం వస్తున్నట్లూ చెప్పుకుని మురిసిపోయేది.

'మహానుభావుడు! పోతూ పోతూ నా కింత అన్నం పెట్టిపోయేడు' అంటూ నిరంతరం పోయిన భర్తకి కృతజ్ఞతలు చెప్పుకునేది సూరమ్మ! శంకరి పెళ్ళి అయిన కొత్తలో ఆడపడుచు, అర్ధరాజ్యానికి అధికారిణియై వున్నట్లు భావించేది. రానురానూ ఆడపడుచుయొక్క అర్ధరాజ్యంమీద అరణాలైనా వసూలు కాకపోయేసరికీ ఆరాజ్యం శంకరగిరి మాన్యం అని తెలిసిపోయింది. అయినా శంకరి పన్నెత్తిమారుమాట చెప్పకుండా సూరమ్మ అజమాయిషీక్రింద, అణిగి, మణిగి పిచికపిల్లల్లె కాపురం చేసింది. సూరమ్మ గొణుక్కుంటూంటే వెంకయ్యకి ముద్ద మింగుడు పడేదికాదు. గ్లాసెత్తిపట్టి మంచినీళ్లు గడగడా తాగుతూ!

'వెధవ పచ్చడిచేసి తగలేశావు! తోటకూరపచ్చడికన్నా ఇంకేమీ దొరకలేదా! వెధవ దరిద్రపుగొట్టు ముఖానికి!' అంటూ, అక్కగారి గొణుగుడు, వినపడకుండా భార్యామణిమీదకు ధ్వజమెత్తేవాడు.

'తోటకూరమటుకు ఊరికే వస్తోందా! మునుపు గుప్పెడు నూకగింజలకీ, చాటెడు తోటకూర పడేసేవారు. ఇప్పుడు తవ్వెడుబియ్యంపెట్టినా, గుప్పెడుకూర రాల్చటం లేదు. పావలా కూరకొంటేకాని ఇంటిల్లిపాదికీ సరిపోవటం లేదు. ఎక్కడికని తేవటం? చీమా దోమా లా, ఇంటినిండా పిల్లలాయె! వీళ్లందరికీ ఏం పెట్టాలి?' మనస్సులోనే విసుక్కునేది శంకరి. తమ్ముడు, మరదలుమీదకి దండెత్తటంతో సూరమ్మకి రోగం సగం నయమయినట్లనిపించేది!

అవునే! ఇన్నేళ్లాయి కాపురం చేస్తున్నావు వాడికేం ఇష్టమో తెలీదుటే! వెధవ పచ్చడి మెతుకులు వాడెప్పుడన్నా తిన్నాడా! ఏదన్నా కూర చేయాలన్న జ్ఞానమన్నా లేదు నీకు! ఆఫీసులో చేసేసి ఇంటికి వస్తాడు. నాలుగు మెతుకులు తిందామనుకునేసరికి గొడ్డుకారం పచ్చడి పడేస్తే ఎలా తింటాడు? వెధవ పచ్చళ్లు తిని బ్రతికే కుటుంబాలా మావి!' అంటూ మరదలుమీదకి ఆవిడా, సైనిక సన్నాహం చేసేది.

తాత్కాలికంగా అక్కగారి వాగ్బాణాల్ని తప్పించుకోగలిగాననే తృప్తితో ఆఫీసుకి వెళ్ళిపోయేవాడు వెంకయ్య. అతనికి అక్కగారంటే వల్లమాలినంత అభిమానం వుండేది. పెద్ద డాక్టరుని పిలిచి పరీక్ష చేయించి మంచి మందులు ఇప్పించుదామనే వుండేది. ఏ డాక్టరు గురించి వాకబుచేసినా కన్సల్టింగ్ ఫీజు పాతిక మొదలు యాభయి రూపాయలదాకా ఉండేది కాని, అంతకి తగ్గివుండేదికాదు. తీరా వాళ్లని తీసుకవచ్చి చూపెడితే, వాళ్లు తమ హోదా తగ్గట్టు, ఏ వంద రూపాయల టానిక్కులో ప్రిస్క్రిప్షన్ వ్రాసి పారేసారంటే, అవి అతను తేలేకపోతే మళ్లీ అదొక రాద్ధాంతం అయితీరుతుంది. అందుకని, రెండు మూడు వందలు చేతిలో పట్టుకుంటేకాని, పెద్ద డాక్టర్ల దగ్గరికి పోకూడదు. ఇవి అన్నీ ఆలోచించుకునేవాడు వెంకయ్య. ఏ నెలన్నా పాతిక రూపాయలు మిగులుతాయేమో అని చూసేవాడు. పాతిక పైసలన్నా మిగల్చలేక గిలగిల్లాడేవాడు వెంకయ్య!

సుబ్బాయమ్మ, వెంకయ్య పెద్దకూతురు. పదహారేళ్ళు నిండివుంటాయి. వోణీలు వేసుకునే వయస్సు వచ్చేదాకా ఆ మేడకి మూడు సందుల కావలవున్న తాటాకు పాకలో వున్న ఎలిమెంటరీ స్కూల్లో అయిదోక్లాసు చదూకొంటూ ఉండేది. వోణీలు వేయించా ఇంకా ఆడపిల్లకి చదువెందుకు? ఉద్యోగాల్చెయ్యాలా! ఊళ్లేలాలా! అంటూ సూరమ్మ, సుబ్బాయమ్మని చదువు మాన్పించేసింది.

సుబ్బాయమ్మంటే సూరమ్మకి, ఎంతో ఆపేక్ష! ఆ పిల్లకి తన తల్లిపేరు కావాలని పెట్టింది. సీతాలక్ష్మి! శంకరమ్మ తొలిసారి కడుపుతోఉండగా ఆడపిల్ల కలగాలని సూరమ్మ జ్ఞాపకం వున్న దేవుళ్లందరికీ ముడుపులు కట్టింది. ఆవిడ కోరిక ఫలించినట్లుగానే సుబ్బాయమ్మ జన్మించింది. ఆవిడ బ్రహ్మానందపడిపోయింది. సుబ్బాయమ్మ తర్వాత రెండేసి ఏళ్ళ కొక్క మగపిల్లాడి చొప్పున కన్నది శంకరమ్మ. గుడ్డిలో మెల్ల అనుకొన్నట్లు, అంతా మగపిల్లలే కలిగారు శంకరికి. ప్రభుత్వం వారు, పట్టుదలగా, కుటుంబ నియంత్రణ ప్రచారం మొదలు పెట్టేసరికే, వెంకయ్య కొంప, సంతానంతో నిండిపోయింది. అయినా, వాళ్లిచ్చే రూపాయిలు ఏ ఖర్చుకయినా వుంటాయని, వేసక్టమీ చేయించుకున్నాడు వెంకయ్య. ఏడుగురు, మగపిల్లల్లో సుబ్బాయమ్మ ఒక్కర్తే ఆడపిల్ల అవటంనించి, మేనత్త దగ్గిర, తల్లి దగ్గిర, బాగా గారాలుపోతూ వుండేది సుబ్బాయమ్మ.

"సుబ్బా!" అని, మేనత్త, తల్లి పిలుస్తూంటే ఆ పిల్లకి, వంటి మీద తేళ్ళూ, జెర్రులూ పాకుతోన్నట్లు అన్పించేది.

"సుబ్బా ఏమిటే రుబ్బూ అన్నట్లు! నాకేదన్నా మంచి పేరు పెట్టి పిలు అత్తా!" అనేది.

"అదేమిటే! పిచ్చిపిల్లా! నీ పేరుకేం! నానమ్మ పేరే తల్లీ! నానమ్మ అదృష్టం ఎవరి కొస్తుందే నా చిట్టీ! పాతి కేళ్ళ నిండకుండానే పునిస్త్రీ చావు చూసింది. మహా ఇల్లాలు! నా తల్లి అదృష్టం, నా కొచ్చిందా ఖర్మ!" అనేది సూరమ్మ. ఆమెకి, తొమ్మిదోయేట పెళ్లి అయింది. పదో ఏట మిగిలిన వన్నీ పూర్తి అయ్యాయి. సూరమ్మ తండ్రి వెర్రిబాగులవాడుగా వుండేవాడు. వెంకయ్య పుట్టిన రెండు నెలలకి, సూరమ్మ తండ్రి చెప్పా పెట్టాకుండా వూళ్ల మీదకి లేచిపోయేడు. వెంకయ్యకి అయిదారేళ్లు వచ్చేసరికి, సూరమ్మతల్లి కూడా గతించింది. సూరమ్మ తల్లి, భర్త లేచిపోయినందుకు, ఏమీ కృంగి పోయేది కాదు. ధైర్యంగా పిల్లల్నిద్దర్నీ పెట్టుకుని, కాలక్షేపం చేసేది. తల్లి అంటే ఎంతో ఆత్మీయతగా వుండేది, సూరమ్మకి. తన మావగారితో పోటా పోటీలు పడి, తన కా మడి చెక్క వ్రాయించినందులకు, తల్లి కార్యదక్షతని పొగుడుకునేది. నలభయి నాలుగేళ్ల వాడికి, రోగిష్టి వాడికి, తొమ్మిదేళ్ల పిల్లని, ముడిపెట్టటం అసందర్భంగా, ఆ కాలంలో ఎవళ్లకీ తోచేది కాదు. కర్మ, పూర్వజన్మసుకృతం, అదృష్టం మొదలయిన పదాలన్నీ, వాళ్ల నాలుకల మీద, నిరంతరం వుండేవి. సుబ్బా యమ్మ సూరమ్మకి, రెండో తరందయినా, నాలుగు తరాలు దాటినంత, నాగరికం నేర్చింది. చదువయితే అబ్బలేదు. తన పేరు నచ్చనందున, "సుభాషిణి"గా మార్చుకుంది. సతతం, ఏవో సినిమా పుస్తకాలూ, నవలలూ, చదూకొంటూ కూర్చునేది. సుబ్బాయమ్మకి, తోడు నీడలా వుండేది "మాలిని". ఆమె మజుందారు మూడో భార్య! మజుందారుకి, అరవయి ఏళ్లు దాటుతో వుంటాయి. మాలినికి ముప్పయి ఏళ్లున్నా, పద్దెనిమిదేళ్ల పడతిలా, పాలుగారే చెక్కిళ్లతో మృదువుగా వుండేది. మజుందారు మొదటి భార్య, విశాలాక్షీ దేవి, మంచం దిగేది కాదు. రెండో భార్య "నందినీ దేవి"కి దైవభక్తి ఎక్కువ. ఉదయం, తొమ్మిది గంటలదాకా పూజలూ, పునస్కారాలూ చేస్తూ, తర్వాత ఇంటి పని చూసుకునేది. విశాలాక్షికి ఇద్దరు కూతుళ్లూ, నందినీదేవికి ఒక కొడుకూ వున్నారు. వాళ్లకీ, పెళ్లిళ్లయినాయి. విశాలాక్షి కూతుళ్లు, ధనవంతుల ఇంటి లోకే వెళ్లారు. నందినీదేవి కొడుకు, దూర ప్రాంతంలో వుద్యోగం చేసుకుంటున్నాడు. అతని పేరు జగన్మోహన చంద్ర. అతని భార్య ఉదయతార, నాలుగేళ్ల కొడుకు, నవీనచంద్ర, చూడ ముచ్చటగా వుంటారు. వాళ్లు వచ్చినప్పుడల్లా, మాలినికి కళ్లు కుట్టుకున్నట్లుండేది. పద్దెనిమిదేళ్ల క్రితం "మాలినీ రాణి"ని పెళ్లి చేసుకుని, ఇంటికి తీసుకువచ్చాడు మజుందారు. భర్త, పెళ్లి సందడి చూసి, నందినీ, విశాలాక్షీ మూతులు ముడు చుకు కూర్చున్నారు.

"ఏం జమీలు, కరగటంలేదవో, ఇంకోర్తిని తెచ్చి కట్టుకుంటున్నాడు!" అంటూ, విసుక్కున్నారు. అప్పటికప్పుడే, స్థిరాస్తిలో చాలామటుకు ఖర్చుచేసేసాడు మజుందారు. పెళ్లయిన కొత్తలో, మాలినిని చూసి, కంటగించుకున్నా, రాను రానూ, మాలిని పసితనాన్ని చూసి, జాలి పడసాగారు. తమతోపాటుగానే, నందినీ విశాలాక్షి కూడా, ఆదరించకలిగారు. "భగవంతుడు, తన్ని ప్రార్థించకుండానే, దురదృష్టం అనేవరం మటుకు, లోకంలో, సగం మందికి దానం చేస్తాడు కాబోలు!" అనుకునేది మాలిని నిసర్గ సౌందర్యం చూస్తూ, నందినీదేవి. మాలిని కాపు రానికి వచ్చేసరికే, పచ్చమేడ ప్రహరీగోడ పడిపోయింది. అప్ప టికే "జగన్మోహన చంద్ర" మేనమామల వూళ్లో, చదువు కుంటూ వుండేవాడు. మాలినికి మజుందారు అంటే, పెను భయంకానీ, భక్తికానీ వుండేవి కావు. నూట పదిహేను మొహిరీ లకి బదులుగా తెచ్చాడామెను మజుందారు. మాలిని తండ్రి పీక మునగా, అప్పుల్లో పడ్డాడు. అతనిదీ పెద్ద జమీందారీ వంశమే! ఆఖరి అమ్మాయి మాలిని, పెళ్లి కెదిగి కూర్చున్నప్పుడు అతనికి దిక్కు తోచలేదు. లోపాయకారీగా, మజుందారుకి కబురంపి, మిత్రు లిద్దరూ, సంప్రతించుకున్నారు. తత్ఫలితంగా, మాలిని, మజుందారు భార్యగా ఇంటికి వచ్చింది. మాలిని అత్త వారింటికి వచ్చేకనే, బయట ప్రపంచం చూడసాగింది. తల్లి గారింట్లో, ఆమెకి విపరీతమైన ఘోషా వుండేది. ఇక్కడ ఆసె కాస్తే, పనీపాటా వుండేది కాదు. వీధివేపున్న కిటికీలకి, పేచని, కర్టెన్లు వుండేవి. ఆ కిటికీవద్ద పేము కుర్చీ వేసుకుని కర్టెను కొద్దిగా తొలగించి రోడ్డు మీదకు చూస్తూ కూర్చునేది. మజుందారు ఆ పచ్చ మేడమీద కూడా బోలెడన్ని అప్పులు చేసాడు. ఖర్చులకి డబ్బు కావల్సివస్తే అప్పులుచేయటం తప్ప ఇంకోలా డబ్బు సంపాయించటం చేతరాదు మజుందారుకి. అతను చిన్నప్పుడు పండితుల దగ్గిర వ్యాకరణమూ సంస్కృత కావ్యాలూ చదువు కొన్నాడు. ఆ చదువు అతనికి జీవనోపాధి చూపెట్ట కలిగింది కాదు. ఇల్లు పూర్వీకుల దర్జాల కను గుణంగా జరగాల్సి వచ్చేది. అతనికి రాబడి మించిన ఖర్చులు అయ్యేవి. ఎక్కువ ఆదాయం అతనికి అప్పులవల్లే సమకూరేది. మజుందారు తల్లి వుండగానే అతని ఇద్దరు కూతుళ్లకీ గొప్ప గొప్ప జమీందార్ల సంబంధాలు చేసాడు. తల్లి చనిపోయేక ఇంటి పెత్తనం మజుందారు చేతిలోనికి వచ్చింది. అప్పటికే తలమునకలుగా వున్న అప్పుల్ని స్థిరాస్థి అంతా అమ్మి తీర్చే సాడు. ఇంక అప్పుడు మిగిలింది పచ్చమేడ! ఇప్పుడు దాని మీద కూడా దొరికినన్ని అప్పులు చేస్తూనే వున్నాడు మజుం దారు. 'జగన్మోహన'కి తండ్రి "దుబారీతనం" తెలుసున్నా ఏమీ అనేవాడు కాదు. అక్క చెల్లెళ్లకి పెళ్లిళ్లయిపోయాయి. అతనా అయిదారు వందలు నెలకి తెచ్చుకుంటున్నాడు. తల్లి పేర ప్రతి నెలా కొంత సొమ్ము పంపేవాడు. వాళ్లందర్నీ వచ్చి తమ దగ్గిర వుండిపోకూడదా అనేవాడు. మజుందారుకి కొడుకు దగ్గరకి వెళ్ళటానికి లజ్జగా వుండేది. "నా జీవితం ఈ మేడలో వెళ్లమారనీ! తర్వాతర్వాత నీ తల్లులని నీవే

చూడాలి! నీకు నేనేమీ మిగల్చలేకపోయినా, ముగ్గురి పోషణ భారం మటుకు తగిలించాను.'' అనేవాడు. ఆయన ఆ మాటలు కొడుకుతో అంటూంటే మాలినికి నిలువెల్లా నిప్పుల్లో వున్నట్లు మండి పడేది. మాలినికి రోజులు గడుస్తోన్నకొద్దీ తనకి జరిగిన అన్యాయం ఏమిటో తెలిసి వస్తూంది. ''సవతుల కిద్దరికీ వంటినిండా బంగార మన్నా వుంది. తనకి అదీ లేదు. అన్నీ కలిపి, పది పన్నెండు తులాలకన్నా ఎక్కువ లేదు. పెద్దావిడని, కూతుళ్ళు భరాయిస్తారు. చిన్నావిడని, కొడుకు భరాయిస్తాడు. తన్నెవరు భరాయిస్తారు? ఈయన కెందుకింత చాపల్యం పుట్టుకురావాలి? ఇంత చిన్న పిల్లని నేనేం చేసుకుంటాను; మా అబ్బాయికి చేసుకుంటాను అని ఎందుకు అనలేదు ? ఎంత కఠినబుద్ధి !'' అనుకునేది. మజుందారుని తిట్టుకునేటప్పుడు, పెళ్ళికి ముందు ఆయన, తన్ని చూడలేదనే సంగతి విస్మరించేది. స్నేహితుడు, ఆపద్ధర్మంగా ఆదుకొమ్మనగానే, సరే అన్నాడు మజుందారు. అప్పటికి జగన్మోహనుడు పదారేళ్ల వాడు. పెళ్లి ఇంకా చేయదల్చుకో లేదు. పద్దెనిమిది సంవత్సరాల్లో ఎన్నో మార్పు లొచ్చాయి. ఆ ఇంట్లో మాలినికి పూర్తి స్వేచ్ఛ వుండేది. ఎక్కడికి పడితే అక్కడికి వెళ్ళుతూ వుండేది. ఘోషా అదీ ఏమీ పాటించేది కాదు. వారానికి అయిదారు సినిమాలన్నా, చూస్తూ వుండేది. మజుందారుకి పెద్దతనం వచ్చింది. రెక్కలు తెగిన జటాయువులా వున్నాడు. మాలిని, మర్యాద, మంచీ, పట్టించుకునేవాడు కాదు. సుబ్బాయమ్మ ఎదిగాక, మాలినీ, ఆ పిల్లా, ప్రాణ స్నేహితులయ్యారు. పది పైసలకీ, పదిహేను పైసలకీ, కిళ్లీ కొట్లమీద, అద్దెల కిచ్చే పుస్తకాల్నీ సుబ్బాయమ్మ తెచ్చి పెట్తూ వుండేది. అవి ఇద్దరూ మాలిని గదిలో కూర్చుని, ఏదో పరీక్షకి వెళ్ళుతూన్నట్లు దీక్షగా చదివేవారు. సుబ్బాయమ్మని తనతోపాటు సినిమాలకి తీసుకవెళ్ళేది. కానీఖర్చులేకుండా సుబ్బాయమ్మకి కాలక్షేపం అయిపోతూ వుండేది. మాలిని సినిమాలకి తరుచూ వెళ్తూంటే, తను చాలా అందంగా వుంటాననే విషయం ఒకటి గుర్తుకు వచ్చింది. రోడ్డమీద, ఆమె వయ్యారంగా నడుస్తూ వుంటే, దారినపోయేవాళ్లు తన్నే కళ్ళు విప్పుకుని చూస్తూ నిలబడి పోవడం గమనించింది. రోజుకి వందసార్లయినా నిలువు టద్దం ముందు నించుని, చిరునవ్వులు నవ్వుకోవటం, జుట్టు రకరకాలుగా, సిగలు జుట్టుకోవటం, ముఖభంగిమల్ని మార్చి మార్చి చూసుకోవటం చేస్తూ వుండేది. చివరికి ఆమెలో సినిమాల్లో జేరిపోయి, గొప్పపేరూ, లక్షల కొద్దీ ధనమూ సంపాదించ వచ్చుననే గాఢ ఆకాంక్ష మొలకెత్తింది. ప్రతి రోజూ పెద్ద పెద్ద సినీయాక్టర్లకీ, డైరెక్టర్లకీ జాబులు వ్రాస్తూ వుండేది. తనకి నటించాలని వున్నదనీ, తను చాలా అందంగా వుంటాననీ, తను రోడ్డుమీదకు కాలు పెట్టేసరికి తను వైజయంతిమాలో, సావిత్రో అనుకుని, తనచుట్టూ అసంఖ్యాకమైన ప్రజలు గుమిగూడు తున్నారనీ వ్రాసుకుంటూ పోయేది. ఆ వుత్తరాలన్నీ చదివి, సుబ్బాయమ్మ ఆశ్చర్యపోయేది. తా మిద్దరూ చదూకొంటూ వున్న పుస్తకాలలోని వాక్యాలకి మల్లే వుండేవి, ఆ వుత్తరాలు! మాలిని ఎప్పటికయినా, పెద్ద తార అయిపోయి తీరుతుందని సుబ్బాయమ్మ నమ్మేది.

సుబ్బాయమ్మ కెప్పుడూ, తాను చదివిన పుస్తకాల్లోని నాయకులు కలల్లోనికి వచ్చేవారు. వాళ్లంతా చాలా అందంగావుండేవారు. డబ్బు, పెద్ద హోదా వుండేవాళ్లు తమ తల్లితండ్రులతో పోట్లాడి, సుబ్బాయమ్మనే పెళ్లి చేసుకుంటాం అని పట్టుపట్టేవారు. సుబ్బాయమ్మ, తల్లీ తండ్రి, మేనత్త, ''మేము కట్నాలు ఇచ్చుకోలేం. మీ అంతస్థుకి తగం!'' అనేవారు దీనంగా. "నేను డబ్బుకి, అమ్ముడుపోను. నాకు మనసు మమత ముఖ్యం! సుభా, మంచి మనసుకి, నిర్మలమైన మమతకి నేను అమ్ముడుపోయాను" అనేవారు. సుబ్బాయమ్మ కలల్లోని నాయకులకి, నిర్దిష్టంగా, ఇదీ అనీ ఒక రూపం వుండేది కాదు. ఒకసారి, నాగేశ్వరరావులా, ఇంకోసారి కాంతారావులా, ఇంకోసారి రామారావులా వుంటూ వుండేవి, వాళ్ల రూపాలు. ఎప్పుడో కారూ, హెయారూ, దర్జా, దర్పమూ వున్న యువకుడు తన్ని ప్రేమించుతాడని, రూఢి చేసుకున్నది, సుబ్బాయమ్మ. ఆకాశం శూన్యంగానే వుంటుంది. అయినా ఎంతో అందంగా వుంటుంది. ఆ మబ్బులు పరుగెట్టుతూంటే, వాటల్లో మన కెన్నో పోలికలు దొరుకుతాయి. ఒకసారి అందమయిన నర్తకిలా, వేరొకసారి విజయుడు ఎక్కిన రథంలా, ఇంకోసారి మయూరిలా మనం ఏమి ఊహించుకుంటే ఆ చిత్రాలు ఆ మబ్బుల్లో కదిలీ, కదలని ఆ నీలినీరదాలలో మనకు కన్పట్టుతాయి. ఉద్వేగపూరితా లయిన వ్యక్తుల మనస్సులు కూడా శూన్యాకాశం లాంటివే! వాళ్ల ఊహించుకున్న సంఘటనలు, తప్పక జరుగుతాయనే నమ్మకం లేకపోతే వాళ్ల ఆ మాత్రం సంతోషంగానైనా జీవితాలు గడపలేరేమో! ఆ ఎదురు చూపులో అమితమైన జీవనాసక్తి!

ఆ రోజు ఉదయం, ఎనిమిది గంటలు దాటుతో వుంది. రథసప్తమి వెళ్లిన నాలుగు రోజులనాడు ! అప్పుడే ఝామ పొద్దెక్కినట్లు, సూర్యుడు చురచురలాడుతూ ప్రయాణం సాగించు తున్నాడు.

ఆదివారం అవటంనించి, క్రింది వాటాల్లో వున్న షాపులో వాళ్లు దుకాణాలు తెరవలేదు. అంచేత ఆ పేట సందడిగాలేదు. నందినీదేవి పూజాగదిలో కూర్చుని ఆదిత్యస్తోత్రం చదువుతూ తన్మయం పొందుతూ వుంది. మజుందారు మహాశయుడు ఈజీచైరులో శరీరం జేరవేసి, అరమోడ్పు కళ్ళతో హుక్కా పీలుస్తూ కూర్చున్నాడు. ఆ సమయంలో ''క్రీక్'' మంటూ ఒక నల్లగా, నిగనిగ మెరిసిపోయేకారు సరిక్రొత్త ఎంబాసిడర్ కారు వచ్చి ఆ పచ్చమేడముందు ఆగింది. అరుగులమీదకువున్న కొట్టు గదులు, పెద్దపెద్ద తాళాలువేసి వున్నాయి. ఆ గది గుమ్మాలు, ఎండా, వానా, తగలకుండా, షెడ్డుని ఆధారంగా చేసుకుని, గోనెపట్టా గుడ్డలు వ్రేలాడదీసివున్నాయి. ఉన్నతమైన దర్వాజాలు. ఇటూ, అటూ, వున్న గోడలు పూర్తిగా పడిపోయి, ఆ మేడ పరిస్థితి ఎంత దీనదశలో వున్నదీ, తెలియ చెప్తూంది. కారులో కూర్చున్న అతను, రెండుసార్లు కారుహారన్ని

"పయ్ పయ్!" మనిపించి మేడకేసి, పరీక్షగా చూసాడు. అతన్ని 'రిసీవ్' చేసుకుందుకు, ఎవరూ ఇవతలకి రాలేదు. కారు హారన్ మ్రోగటం, ఇంట్లోవున్న అందరికీ వినపడింది!

"అదుగో! వాకిట్లో ఏదో కారువచ్చి ఆగినట్లుంది. వెంకాయి "డాటరు"ని తీసుకు వచ్చాడు కామాల్సు! ఎంత యువా, రక్తం పంచుకు పుట్టినవాడు, వసే శంకరీ! కుంపటి మీద కాసిని వేణ్నీళ్ళు పడేయి. డాటరు వచ్చినట్లున్నాడు. కారాగింది. కాస్త డికాషను కూడా తీసి కాఫీ చేయి, డాటరు గారికి ఇద్దువుకాని. ఆయన చూసియామంటాడో! ఇండేషను చాలంటాడో, ఆపరేషను కూడా చేసుకోవాలంటాడో! ఏమంత వయసు ముదిరిందనో మాయదారిరోగం ఒచ్చిపడింది! మొన్న పున్నమి వెళ్లిన ఉదియుకే కదూ నలభయి ఎనిమిదీ నిండుతా! వున్నదేదో పూడ్చిపెట్టటానికి ఒస్తాయి మాయి రోగాలు. ఈ రోగం రాకపోతే ఈసరికి, సుబ్బాకి మెళ్లో మూడుముళ్ళూ వేయించేద్దును! ఎన్నిఆలీసు (హార్లిక్స్)సీసాలుతాగను? అవిఅన్నీ ఏమయిపోయాయో! ఒకటే నీరసం! ఎంతతిన్నా బలం పట్టందే వంటికి! చెర్లో పోసినట్లే! తిన్న తిండి అంతాను. కారేసుకు ఒచ్చినట్లున్నాడు డాటరుబాబు. యంబీ, యస్సీ అయ్యుంటాడు. నలభయ్యో, యాభయ్యో వడుకుతాడుకామాల్సు. పోన్లే, ఏం చేస్తాం? ఆ మడిచెక్క అమ్మి పారేస్తే సరి! ప్రాణం కన్నానా!" అనుకుంటూ, సూరమ్మ, తన ప్రక్క సుబ్బరంగా పర్చుకొని, తిన్నగా, పడుక్కుంటూ "హు— హు" అంటూ ఆయాస పడసాగింది.

కారాగిన చప్పుడికి ఉలిక్కి పడింది "మాలిని". అద్దం ముందుకు వెళ్లి నించుని కళ్లు విప్పార్చుకుని చూసుకుంది.

"హోష్! కారు ఆగింది. ఆ కారు తనకోసమే వొచ్చి వుంటుంది. అందులో వున్నవాళ్లు, సినీయాక్టర్లో, డైరెక్టర్లో అయివుంటారు. హాలులో కూర్చున్న తన భర్త దగ్గరికివస్తారు.

"మిస్ మాలిని ఇక్కడేకదా వుండేది! ఆమెని కలుసుకోవాలని ఒచ్చాము. మేము తీయబోయే "అతకని మనసులు" పిక్చరులో హిరోయిన్‌గా, ఆమెని బుక్ చేస్తున్నాము. యాభయివేలు. ఎడ్వాన్సుగాఇచ్చి, కంట్రాక్ట్ వ్రాయించుకోవాలని అనుకుంటున్నాము" అంటూవుంటారు. "ఛ! ఈ రోజా తలకి స్నానం చేసింది. జుట్టు ఎంతకీ ఆరదు. ఒంకులొంకులుగా కాలి మడమలని తాకే ఈ జుట్టు ఎప్పటికి చిక్కుతీసుకోగలదు? ముఖాని కింకా పసుపు చాయలు మిగిలే వున్నాయి. ఇప్పుడు ముఖానికి ఇంత నూనె పులుముకొని నలుగుపిండితో తోముకుంటేకాని, ఆ పసుపుచాయలు వదలవు! ఈ పసుపు రాసిన ముఖంతో పురాణకాలపు పునిస్త్రీలా వాళ్లెదుటకి ఎల్లా వెళ్లటం?" అనుకుంది మాలిని. ఆమె పొత్తయిన పొడవాటి జుట్టు ఇంకా ఆరలేదు. నుదుటమటుకు, ఆరిన ముంగురులు తమాషాగా, ఎగురుతున్నాయి. ఆ తడిజుట్టును, అల్లానే, మెలికద్రిప్పి నడినెత్తికి ముడివేసి వెండిపిన్నులు గుచ్చింది. ఆ పిన్నులకి మూడేసి ముత్యాలగుత్తులువున్నాయి. ముఖం శుభ్రంగా, కడుక్కొచ్చి విశాలంగా సోగగావున్న కన్నులకి కాటుక తీర్చిదిద్దింది. నుదుట విల్లువంపులా వున్న కనుబొమ్మలమధ్యగా ఆవగింజంత సింధూరవుబొట్టు పెట్టుకుంది. లేత మబ్బురంగులో జరీ పువ్వులున్న చీరకట్టుకుని, ముదరు నీలం పట్టు చోళీ ధరించింది. బీరువాకి, బిగింపబడ్డ నిలువుటద్దంముందునించుని, చెంపల్లో సన్నని గుంటలుపడేలా చిరునవ్వు నవ్వుకుంటూ, హాలులోంచి తన కోసరంవచ్చే పిలుపుకోసరం నిరీక్షిస్తూంది మాలిని.

కారు ఆగి, హారన్ మ్రోగగానే సుబ్బాయమ్మ, బాల్కనీలోకివచ్చి క్రిందికి చూసింది. ఎంతగా హారన్ మ్రోగించినా, ఎవరూ గుమ్మంలోనికి రాకపోవటంనించి, డోరు తలుపుతీసుకుని, దిగి, మేడకేసి పరీక్షగా చూస్తూ నిలుచున్న యువకుడు కనపడ్డాడు. అతను, తెల్లగా, పొడుగ్గా దర్జాగా వున్నాడు. ఉంగరాల జుట్టు, నవ్వేకళ్ళూ! పాంటు జేబులో చేతులుపోనిచ్చి, మేడకేసి దీక్షగా చూస్తున్నాడు. సుబ్బాయమ్మ హృదయం దడదడలాడింది. శరీరం ముచ్చెమటలు పోసింది. కళ్లు సంతోషంతో తళతళ్లాడేయి! లేతపెదవులు, సన్నగా అదరసాగాయి! ఎలాగో తన్నుతాను నిలబెట్టుకుని వక్కసారి అతనికేసి సిగ్గులమొగ్గలా చూసింది. మళ్లీ తన వెంపు చూసుకుంది. చేతులకి వెలసిపోయిన ఎర్రటి రబ్బరుగాజులు! అంచులు బురద కొట్టినట్లున్న కనుమాసిపోయిన, చీటీపువ్వుల పరికిణి! తల్లిపాతచీర చినిగిపోతే, కాస్త గుడ్డ, వోణిగా చేసుకుని వేసుకుంది! చేతులకందని జుత్తు, చీకిరి, బాకిరిగా వీపునిండా పరచివుంది. అతణ్ణి ఆ అందాల రాజకుమారుణ్ణి ఆ పిల్ల చాలాసార్లు సినిమాహాలువద్ద చూసింది. రెండుమూడుసార్లు తన్ని అతను గుర్తు పట్టినట్లు చిరునవ్వు నవ్వినట్లుకూడా అనుమానం! ఇవ్వాళ, ఏకంగా ఇంటికే ఒచ్చాడు! బహుశా, తన తండ్రి ఎవరో తెలుసుకోవటం గురించి వచ్చి వుంటాడు. తను ఇంకా ఇల్లాగే వుంటే ఎల్లా?

గభాలున లోపలికి వెళ్లబోయింది. పరికిణి కుచ్చెళ్లు కాళ్ళకడ్డంపడి, బోర్లగిలా పడిపోయింది. మోకాళ్లు గీరుకుపోయాయి. నాలిక కరుచుకుని రక్తం కూడా వచ్చింది. ఉత్సాహం ఉరకలలో, ఆపిల్లకి ఆదెబ్బలేం పెద్దబాధకరిలిగించలేదు. లోపలికి వెళ్లి, మేనత్త, తండ్రితో పోరిపోరి పెళ్ళిచూపులకని కుట్టించివుంచిన, పెద్దపెద్ద గులాబీపూల పరికిణి, లేత గులాబీ రంగు వాయిల్ వోణి, ధరించి, తలనిండా నూనెరాసుకుని గట్టిగా బిగించి జడవేసుకుని తల్లి, దేముడు పూజకోసరంకోసి వుంచిన ముద్దమందార పూవు జడలో పెట్టుకుంది. బొట్టూ, కాటుకా పెట్టుకుని, చెంగుచెంగుమంటూ మూడేసి మెట్లు ఒక్కొంగలో దిగుతూ, మజుందారుగారి ఇంటిలోనికి ఒచ్చిపడింది. ఆసరికే మాలిని, సింగారించుకుని కూర్చుంది. ఆ అబ్బాయి చేతిలోఏవోకాగితాలు పట్టుకుని నెమ్మదిగా దర్వాజా దాటి మేడమీదకు వచ్చాడు. మాలినీ, సుబ్బాయమ్మా, కిటికీ కర్టెను తొలగించి, ముఖమంతా కళ్లు చేసుకుని చూస్తున్నారు. అతను మజుందార్‌తో పదినిముషాలు మాట్లాడేడు. అతను

ఏవో మాట్లాడుతున్నాడు. వీళ్ళకి ఏమీ వినిపించటంలేదు. ఎవళ్ల వూహాలోకంలో వాళ్ళు తేలుతున్నారు. అతను మజుందారుగారికి ధన్యవాదాలు చెప్పి, రెండో అంతస్తుకేసి వెళ్లాడు. సుబ్బాయమ్మ మనసు పరవశించి పోయింది. ఆశాడోలికల్లో వూగిపోతూ తూరీగల్లె ఎగురుకుంటూ, తన ఇంటికి వెళ్లింది. వారినికూడా అనుసరించింది. వీళ్లిద్దరు వెళ్లేసరికి సూరమ్మ, హైరానుపడుతూ ఆ యువకుడితో మాట్లాడుతోంది. అతను సూరమ్మ మంచంకి కాస్త ఎడంగా వేసివున్న ముక్కాలిపీటమీద కూర్చున్నాడు. శంకరి, ఒంటినిండా చెంగుకప్పుకుని, సత్తు గ్లాసుతో కాఫీతీసుకువచ్చి ఇచ్చింది. అతను వద్దనకుండా, ఆప్యాయంగా తీసుకున్నాడు.

"ఏమిటో! వహాటే నీర్సం తండ్రీ! ఎంతతిన్నా నీర్సమే నాయనా! రెండడుగులు వేస్తే, ఆయాసం దడా! ఏం రోగమో ఏమిటో, అంతు పట్టకుండా వుంది. మా వెంకాయ పెళ్లికి రెండుకుంచాల 'అండా'నీఒక్కచేత్తో ఒంపిపడేసాను. ఆరునెలాయి ఇలా ఖాయిలా పడిపోయేను. ఏమిటో ఇంట్లో ఇబ్బందుల్నించీ, మా వెంకాయ రేపూ, మాపూ అంటూ నిన్ను తీసుకురావటానికి వాన్నేసాడు! అబ్బా! అయ్యో!' అంటూ ఒకటే హైరానుపడసాగింది, సూరమ్మ. ఆ యువకుడు ఇల్లు పైకప్పు, గోడలూ అన్నీ పరిశీలనగా చూస్తూ, కాఫీ త్రాగటం పూర్తి చేసేసాడు. నెమ్మదిగా లేచి నించున్నాడు. చవుడుబారిపోయి పొగచూరిపోయిన గోడలూ, గచ్చులు పోయిన నేలా, సగం వూడిపోతూన్న వూచలతో వున్న కిటికీలూ, అన్నీ అతనివైపు ఆ లక్ష్మీప్రసన్నుని వైపు ఆత్రుతగా చూస్తున్నాయి!

"మీకు వంట్లో బాగాలేదా మామ్మగారూ! డాక్టరు కోసం ఎవర్నయినా పంపేరు కాబోలు! నేను డాక్టరుని కాను మామ్మగారూ! ఈఇల్లు మా నాన్నగారికి, బాకీ క్రింద దాఖలు పడిందట! ఇదంతా బాగుచేయించి, ఏదో గవర్నమెంటు ఆఫీసుకి అద్దెకిస్తారట! వచ్చేనెలాఖరులో ఈ ఇంటిని అందరూ ఖాళీ చెయ్యాల్సుంటుందని చెప్పి రమ్మన్నారు. మజుందారుగారు, అప్పులు పోనూ, మిగిలిన డబ్బు పట్టుకుని వారి కుమారుడిదగ్గరకు వెళ్లివుంటా రనుకుంటాను. మిగిలిన వాళ్లంతా, వేరే ఇళ్లు చూసుకోవాల్సి వుంటుంది. మీ తమ్ముడుగారితో కూడా చెప్పండి! వస్తాను. మళ్లీ కనపడతాలెండి!" అంటూ మెట్లు దిగసాగాడు. ఇన్నాళ్లూ మజుందారిగారి ధర్మమా అంటూ కానీ అద్దె కట్టనవసరం లేకుండా ఆ ఇంట్లో కాలక్షేపం చేశారు, వెంకయ్య కుటుంబం వాళ్లు. పులిమీదపుట్రలా ఇదొకటి వొచ్చి పడింది! అతని బూట్లు టక్‌టక్ మంటూ చేసే చప్పుడు అదృశ్యమయ్యేదాకా, ఆ మూడు జతల కళ్లూ శూన్యదృక్కులతో చూస్తూ వుండిపోయేయి!

